

సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

దుండిగల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు వారి అనుచరులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు బృందం, మాజీ కౌన్సిలర్లు ఈవీ సాగర్ రావు, బొబ్బా రంగారావు, బొడ్డు వెంకటేశ్వరరావు సోదరులు బొడ్డు రవి, బొడ్డు అశోక్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు గణేష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, సెక్రటరీ మురళీగౌడ్, కార్యకర్తలు, మహిళలు కాంగ్రెస్‌లో చేరారు.

పార్టీ మారే ఆలోచన లేదు: ఎమ్మెల్యే మాధవరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతున్నప్పటికీ సమావేశానికి హాజరుకావాల్సి వచ్చిందని, ఒకవేళ ఈ సమావేశంలో పాల్గొనకపోతే పార్టీ మారుతున్నారంటూ తనపై అసత్య ప్రచారం జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, నియోజకవర్గ బీఆర్ఎస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

'విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ కట్ చేస్తాం'

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని, లేకుండా కరెంటు కనెక్షన్ కట్ చేస్తామని టీఎస్ఎస్‌పీడీసీఎల్ కేపీహెచ్‌బీ సెక్షన్ ఏఈ విద్యాసాగర్ బుధవారం తెలిపారు. ఈ మేరకు పెండింగ్ బకాయిలపై లైన్‌మెన్స్, ఇతర సిబ్బందితో కలిసి ఏఈ కమర్షియల్ మీటర్స్, నివాస గృహాలను పరిశీలించారు. నెలల తరబడి బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వినియోగదారులను కలిసి మాట్లాడారు. మార్చి 31వ తేదీలోపు బిల్లులు చెల్లించాలని లేకుంటే కరెంట్ కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరించారు.

శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాణప్రతిష్ఠ



ఆలయ ప్రాణప్రతిష్ఠలో ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాణప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, విమానశిఖర ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఉప్పలపాటి శ్రీకాంత్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు వేంకటేశ్వర్లు, సుజాత, రాజమౌళి, సువర్ణ, దాసరి గోపి, పూర్ణచందర్ రావు, సత్యనారాయణ, ఆచార్యులు, మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మోహన్‌ముదిరాజ్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

నలుగురు గొలుసు దొంగల అరెస్ట్

పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో నలుగురు బంగారు గొలుసు దొంగలను అరెస్ట్ చేసినట్టు ఏసీపీ రాములు తెలిపారు. ఈ రెండు కేసుల వివరాలు విలేకరుల సమావేశంలో బుధవారం వివరించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాములు

వృద్ధురాలిని కిడ్నాప్ చేసిన భార్యాభర్తలు

పేట్‌బషీరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని వ్యాన్‌లో కిడ్నాప్ చేసి ఒంటిపై ఉన్న నగలను దోచుకున్న పాత నేరస్తులైన భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏసీపీ రాములు, సీఐ విజయవర్ధన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహరాజుతో కలిసి విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. బోడుప్పల్ పీర్జాదిగూడ, మాధురికాలనీకి చెందిన దండుగుల మల్లేష్, లక్ష్మి దంపతులు. బోడుప్పల్‌లో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ మద్యం, కల్లుకు బానిసై వ్యసనాలకు అలవాటు పడ్డారు. వచ్చే సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలు చేస్తున్నారు. వీరిపై 2016, 2022లో తిరుమలగిరి పీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. ఈనెల 22న కుత్బుల్లాపూర్, జయరామ్‌నగర్‌లోని కల్లు కంపౌండ్‌లో కల్లు తాగుతున్న లింగిత భూదేవి(61)వృద్ధురాలి మెడలోని బంగారం చూసి ఆమెతో మాటలు కలిపారు. ఈ క్రమంలో వారు తెచ్చుకున్న వ్యాన్‌లో వృద్ధురాలిని ఎక్కించుకొని జవహర్‌నగర్ నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి ఒంటిపై ఉన్న 1.4 గ్రాముల చెవి దిద్దులు, ఒక గ్రామ్ ముక్కు పుడక, 13 తులాల వెండి పట్టీలను తీసుకొని, వృద్ధురాలిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. మత్తు నుంచి తేరుకున్న వృద్ధురాలు ఈనెల 24న కుటుంబసభ్యులతో కలిసి పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి బోడుప్పల్‌లోని వారి ఇంటిలో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు.

● **మహిళ మెడలో..**

శ్రీకాకుళం జిల్లాకు చెందిన వెంకటరమణ(28), సంతోష్ కుమార్(27) స్నేహితులు వీరిద్దరూ కొంపల్లిలోని వసతి గృహంలో ఉంటున్నారు. వీరు ఈజీమనీ కోసం దొంగతనాలు చేస్తున్నారు. ఈనెల 21న అల్వాల్‌లోని వెంటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి వస్తున్న గాయిత్రిని గమనించిన వీరు బైక్‌పై ఆమెను వెంబడించారు. ఈ క్రమంలో ఆమె మెడలో ఉన్న 3.7 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దీంతో గాయిత్రి కుటుంబసభులతో కలిసి అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకున్న వెంకటమరణ, సంతోష్‌కుమార్‌లను శ్రీకాకుళం జిల్లాలో అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. దొంగిలించిన 3.7 తులాల బంగారు గొలుసు, బైక్, రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వాచ్‌మన్ మృతి



మృతి చెందిన శంకర్

జీడిమెట్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సూరారంకాలనీ సుందర్‌నగర్‌కు చెందిన కె.శంకర్(56) జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్-4లోని యాకిమ్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్యూటీకి వచ్చిన శంకర్ తెల్లవారిచూసేసరికి మృతి చెంది ఉన్నాడు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్



పట్టుపడ్డ యువకుడు

జీడిమెట్ల: ఒడిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తరలిస్తున్న యువకుడిని జగద్గిరిగుట్ట పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతడి నుంచి 2 కిలోల గంజాయి, సెల్‌ఫోన్, 2,710 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా, గాంధీనగర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ లిమా(35) బుధవారం జగద్గిరిగుట్టలో గంజాయితో కూడిన బ్యాగుతో వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. అతని నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని క్లినిక్‌లపై కేసు

పేట్‌బషీరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడిపిస్తున్న ఇద్దరు ఆర్‌ఎంపీ డాక్టర్లపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లిలో వసంత ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరిట డాక్టర్ గిరిధర్, అదే ప్రాంతంలో శ్రీ కృష్ణ పేరుతో కవిత క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. వీరిపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ సిహెచ్ హన్మంతరావు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆర్‌ఎంపీ డాక్టర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు ఏపీలో పరీక్షా కేంద్రాల పెంపు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షా కేంద్రాలను పెంచినట్లు అధికారులు తెలిపారు. టీఎస్ ఎప్‌సెట్‌కు ఈ ఏడాది ఏపీలో పరీక్షా కేంద్రాలను భారీగా తగ్గించడంపై 'ఎప్‌సెట్‌కు ఏపీలో తగ్గిన పరీక్షా కేంద్రాలు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి టీఎస్ ఎప్‌సెట్ ఉన్నతాధికారులు స్పందించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎప్‌సెట్‌కు ఏపీలో తగినన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని, ఏపీ అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సెట్ నిర్వహణ బాధ్యత చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులను ఆదేశించారు. ఏపీలోని విశాఖపట్నం జోన్ పరిధిలో విజయనగరం, విజయవాడ పరిధిలో మచిలీపట్నం, గుడ్లవల్లేరు, గుంటూరు పరిధిలో నర్సరావుపేట, తిరుపతి పరిధిలో మదనపల్లి, కర్నూలు పరిధిలో నంద్యాల, అనంతపురం పట్టణాల్లో అదనంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఏపీ అభ్యర్థుల నుంచి వస్తు న్న డిమాండ్ మేరకు అవసరమైతే మరో 10 వేలమంది అభ్యర్థులకు సరిపడేలా మరికొన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసి ఉంచాలని టీసీఎస్ సిబ్బందికి జేఎన్‌టీయూ అధికారులు సూచించారు. కొత్త పరీక్షా కేంద్రాల ఏర్పాటుతో సుమారు 8,500 మంది అభ్యర్థులు వారి నివాస ప్రాంతాలకు సమీపంలో పరీక్షా కేంద్రాలను ఎంచుకునేందుకు వీలు ఏర్పడింది. ఈనిర్ణయం పట్ల అక్కడి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

స్టార్ ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ పల్మనాలజీ సూట్ ఆవిష్కరణ



సూట్ ఆవిష్కరణలో డాక్టర్ విజయ్‌కుమార్, డా.గోపిచంద్ మన్నం

రాయదుర్గం, మార్చి27(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని స్టార్ ఆస్పత్రిలో అత్యాధునిక ఇంటర్‌నేషనల్ పల్మనాలజీ సూట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఆర్ విజయ్‌కుమార్, హైదరాబాద్ స్టార్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం ముఖ్యఅతిథులుగా హాజరై సూట్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఊపిరితిత్తులు, వాయుమార్గాల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకృతం చేస్తూ ఊపిరితిత్తుల వైద్యంలో ఈగ్రౌండ్ బ్రేకింగ్ సదుపాయం ముఖ్యమైన మైలురాయి అన్నారు. పలు రకాలైన పల్మనరీ వ్యాధులను తగ్గించడానికి రూపొందించబడిన మినిమల్ ఇన్వాసివ్ విధానాలను ఉపయోగిస్తుందన్నారు. కచ్చితమైన ప్రయోజనాలను నిర్ధారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషన్ శ్రీకాంత్, డాక్టర్ చందనతో పాటు పలువురు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

2030 నాటికి కృత్రిమ మేధస్సు

పటాన్‌చెరు రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): 2030 నాటికి మానవ మేధస్సుతో కృత్రిమ మేధ(ఏఐ) సరిపోలుతుందని, ప్రస్తుతం అది మనం నిర్దేశించిన పని చేయడానికే పరిమితమైందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, ఏఐలో ప్రఖ్యాత నిపుణుడు డాక్టర్ సిబా ఉద్గత అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' అనే అంశంపై రెండురోజుల జాతీయ వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధను శోధించేవారు, తాము కనుగొన్నది సమాజంపై చూపే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గీతం సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొల్లూరు శ్రీకృష్ణ వర్చువల్‌గా సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ట్రిబుల్ ఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి, వర్క్‌షాప్ నిర్వాహకుడు డాక్టర్ మోతహర్ రెజా, సమన్వయకర్తలు డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఏప్రిల్ 2లోగా జేఎన్‌టీయూ ఫస్టియర్ ఫలితాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఫస్టియర్ సెమిస్టర్ ఫలితాలను ఏప్రిల్ 2వ తేదీలోగా ప్రకటిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఇటీవల కాలేజీలో పనిచేస్తున్న సాంకేతిక సిబ్బంది అకస్మాత్తుగా మానేయడంతో ఫలితాల వెల్లడిలో కొంత జాప్యం ఏర్పడిందని తెలిపారు. అలాగే, ఫస్టియర్ ఫలితాలను ప్రకటించిన వారం రోజుల్లోగా సెకండియర్ ఫలితాలు వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

జేఎన్‌టీయూలో మెగా వైద్య శిబిరం

హైదరాబాద్‌సిటీ: జేఎన్‌టీయూ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విద్యార్థులు, ఉద్యోగుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ మెగా హెల్త్ క్యాంప్‌లో వివిధ ప్రైవేటు ఆసుపత్రులకు చెందిన నేత్ర, దంత, హృద్రోగ నిపుణులు వర్సిటీ సిబ్బందికి, విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు.

కొత్తగూడ ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్‌సిటీ: సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ కోసం కొత్తగూడ ఫ్లైఓవర్ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హఫీజ్‌పేట నుంచి గచ్చిబౌలికి వెళ్లే వాహనదారులను సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వర కు అనుమతిస్తారు. బొటానికల్ గార్డెన్ వైపు నుంచి ఆర్టీఏ కార్యాలయం వైపునకు, జయభేరి నెక్సా, గచ్చిబౌలి నుంచి హఫీజ్‌పేట వైపునకు వెళ్లే వాహనాలను ఫ్లైఓవర్ పైకి అనుమతిస్తారు.